క్లుప్తంగా

ఎల్లమ్మ తల్లి బోనాలు ప్రారంభం

హసన్‌పర్తి: 65వ డివిజన్ దేవన్నపేటలో ఎల్లమ్మ తల్లి బోనాలు – జమదగ్ని కల్యాణ వేడుకలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఈ వేడుకలు ఆరు రోజుల పాటు కొనసాగుతాయని నిర్వాహకులు తెలిపారు. కాగా, బోనాల కార్యక్రమానికి ఎమ్మెల్యే అరూరి రమేష్ ముఖ్యఅతిథిగా పాల్గొని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ దివ్యారాణి, డివిజన్ అధ్యక్షుడు శ్రీనివాస్, ఆత్మ డైరెక్టర్ భూపాల్, గీత కార్మికులు సుమన్ పరమేశ్వర్, సదానందం, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

రాంపూర్‌లో 'బడిబాట'



మడికొండ: బడిబాట కార్యక్రమంలో భాగంగా రాంపూర్‌లోని మండల పరిషత్ పాఠశాల ఆధ్వర్యంలో శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం సమ్మయ్య మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో నిష్ణాతులైన ఉపాధ్యాయులతో నాణ్యమైన విద్య అందుతోందని వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సురేందర్‌రెడ్డి, అరుణ, స్వర్ణలత, విద్యార్థులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా బద్రి



హన్మకొండ చౌరస్తా: బీఆర్ఎస్ 4వ డివిజన్ ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా పెద్దమ్మగడ్డకు చెందిన హన్మకొండ బద్రి నియమితులయ్యారు. బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు, ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్ ఆదేశాల మేరకు స్థానిక కార్పొరేటర్ బొంగు అశోక్‌యాదవ్ శుక్రవారం బద్రికి నియామక ఉత్తర్వులు అందజేశారు. కాగా, తన నియామకానికి సహకరించిన నాయకులకు బద్రి కృతజ్ఞతలు తెలిపారు.

పరీక్ష కేంద్రం తనిఖీ



రామన్నపేట: నగరంలోని ఎల్‌బీ కళాశాలలో కాకతీయ విశ్వవిద్యాలయం దూరవిద్య పీజీ పరీక్షా కేంద్రంలో నిర్వహిస్తున్న ఎంఏ, ఎంకామ్ పరీక్షలను కేయూ అధికారులు ప్రొఫెసర్లు వెంకయ్య, ఈసం నారాయణ శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పరీక్షలు జరుగుతున్న తీరును వారు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అరుణ డీహెచ్‌రావు తెలిపారు. కార్యక్రమంలో పరీక్షల నియంత్రణ కన్వీనర్ సీహెచ్.రాజమౌళి, పరీక్షల ప్రత్యేక అబ్జర్వర్ ఎం.రమ్య, ఫ్లయింగ్ లెఫ్టినెంట్ బి.ప్రభాకర్, కెప్టెన్ డాక్టర్ ఎం.సదానందం పాల్గొన్నారు.

25న బీఆర్ఎస్ ఆవిర్భావం

ఖిలా వరంగల్: బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సీఎం ఈనెల 25న వరంగల్ తూర్పు నియోజకవర్గ ప్లీనరీతో పాటు వాడవాడలో పార్టీ జెండా ఆవిష్కరణలు చేయాలని ఎమ్మెల్యే నరేందర్ సూచించారు. ఈమేరకు కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులకు వరంగల్ ఫోర్ట్ రోడ్డులోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం మార్గనిర్దేశం చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ దిడ్డి కుమారస్వామి, సిద్దం రాజు, మరుపల్లి రవి, బైరబోయిన ఉమ, వేల్పుగొండ సువర్ణ, పోశాల పద్మ, ముస్కమల్ల అరుణ, సోమిశెట్టి ప్రవీణ్, అనిల్, సొసైటీ అధ్యక్షుడు కేడల జనార్దన్, పలు డివిజన్ల అధ్యక్ష, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

రేపు గురుకుల ప్రవేశ పరీక్ష

హన్మకొండ చౌరస్తా: హనుమకొండ పెద్దమ్మ గడ్డ శివారులోని గిరిజన ప్రతిభా జూనియర్ కళాశాలలో ఈనెల 23వ తేదీన గురుకులాలో 5వ తరగతిలో ప్రవేశాల కోసం పరీక్ష నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ పద్మిని శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. పూర్తి వివరాలకు 94909 57328 నంబర్‌లో సంప్రదించాలని పేర్కొన్నారు.

అగ్ని ప్రమాదాలపై అవగాహన



హన్మకొండ: అగ్ని ప్రమాదాలు జరగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని హనుమకొండ ఫైర్ ఆఫీసర్ నాగరాజు సూచించారు. అగ్ని ప్రమాదాల నివారణపై హనుమకొండ నక్కలగుట్టలోని టీఎస్ ఎన్పీడీసీఎల్ స్టోర్‌లో శుక్రవారం అవగాహన సదస్సు జరిగింది. మంటలను ఎలా ఆర్పివేయాలో ప్రయోగాత్మకంగా చూపించారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ మంటలు వ్యాప్తి చెందిన వెంటనే అగ్నిమాపక నిరోధకాలను ఉపయోగించి సాధ్యమైనంత వరకు అదుపులోకి తీసుకురావాలని చెప్పారు. అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో అగ్నిమాపక ఉద్యోగులు బి.సుధాకర్ రెడ్డి, ఎం.రాజేందర్, ఎ.రూప్‌సింగ్, జి.బాబు తదితరులు పాల్గొన్నారు.

అన్ని పండుగలకు సమప్రాధాన్యం



దుస్తులు అందజేస్తున్న విజయ్‌భాస్కర్, లోహిత



వరంగల్: ఇఫ్తార్ విందు ఇస్తున్న వెంకటరమణ



రంజాన్ కానుకలు అందజేస్తున్న మహేష్

హన్మకొండ: అన్ని మతాల పండుగలను రాష్ట్ర ప్రభుత్వం సమప్రాధాన్యం ఇస్తూ అధికారికంగా నిర్వహిస్తోందని భారత జాగృతి రాష్ట్ర ఉపాధ్యక్షుడు దాస్యం విజయ్‌భాస్కర్ అన్నారు. వరంగల్ పశ్చిమ నియోజకవర్గం పరిధి హనుమకొండ ఎన్జీవోస్ కాలనీలో శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 58వ డివిజన్‌కు చెందిన ముస్లింలకు దుస్తులు పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈమేరకు కార్పొరేటర్ ఇమ్మడి లోహితతో కలిసి విజయ్‌భాస్కర్ దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మసీదు కమిటీ అధ్యక్షుడు మహమ్మద్ ఫయాజ్, బీఆర్ఎస్ 58వ డివిజన్ మైనార్టీ అధ్యక్షుడు ఖదీర్, నాయకులు ఆరిఫ్, అంకుష్, యూసుఫొద్దీన్, ఆకుల మధు, వేణు, మహేందర్ పాల్గొన్నారు.

21వ డివిజన్‌లో ఇఫ్తార్ విందు

వరంగల్: రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని 21వ డివిజన్‌లోని రాయన్ ప్యాలెస్‌లో ముస్లింలకు బీజేపీ నాయకుడు డాక్టర్ వన్నాల వెంకటరమణ శుక్రవారం రాత్రి ఇఫ్తార్ విందు ఇచ్చారు. కార్యక్రమంలో యూసుఫ్ ఖాజాపాషా, మొయినొద్దీన్, రియాజ్, ఖలీల్, ఆరిఫ్, జావిద్ పాల్గొన్నారు.

పేద ముస్లింలకు రంజాన్ కానుకల పంపిణీ

ఖిలా వరంగల్: 37వ డివిజన్ తూర్పుకోటలో ఓబీసీ మోర్చా వరంగల్ జిల్లా అధ్యక్షుడు కందిమల్ల మహేష్ ఆధ్వర్యంలో పేద ముస్లింలకు రంజాన్ కానుకలను ఎంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 50మందికి రంజాన్ సరుకులు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏసిరెడ్డి రంజిత్, కందిమల్ల దేవేందర్, అక్బర్, ఎండీ.పాషా, కార్తీక్, కిషోర్, అస్లిక్, షహనాజ్, జరీనా పాల్గొన్నారు.

రైతులకు అవగాహన కల్పించే వరకు ఆగండి



మిర్చి బస్తా తూకాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

వరంగల్: ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా మిర్చి బస్తాల బరువు విషయంలో పూర్తిగా అవగాహన కల్పించే వరకు వ్యాపారులు ఓపిక పట్టాలని, త్వరతగతిన విస్తృతంగా ప్రచారం నిర్వహించి రైతులకు ఈవిషయంపై అవగాహన కల్పించాలని వరంగల్ కలెక్టర్ పి.ప్రావీణ్య అన్నారు. ఈనెల 21 నుంచి మిర్చి బస్తా బరువు 49 కిలోలు మించితే అరకిలో తగ్గించేందుకు నిర్ణయం జరిగిన నేపథ్యంలో రైతులకు పూర్తి అవగాహన కల్పించకుండా.. బరువులో కోత పెడితే సహించేది లేదని రైతు సంఘాలు ప్రకటించాయి. అయితే తగ్గింపును వాయిదా వేయాలని కలెక్టర్ ప్రావీణ్య మార్కెటింగ్ అధికారులతో ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులకు సమాచారం అందించారు. ఈక్రమంలో శుక్రవారం వరంగల్ వ్యవసాయ మార్కెట్‌ను కలెక్టర్ ప్రావీణ్య సందర్శించారు. ఈసందర్భంగా ఆమె మార్కెట్‌లోని మిర్చి యార్డుల్లో ఉన్న బస్తాలను పరిశీలించారు. యార్డుల్లో తూకం వేస్తున్న బస్తా 62 కిలోలు ఉన్న విషయాన్ని క్షేత్ర స్థాయిలో ఛాంబర్ అధ్యక్షుడు బొమ్మినేని రవీందర్‌రెడ్డి కలెక్టర్‌కు చూపించారు. అనంతరం మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ చాంబర్‌లో కలెక్టర్ ప్రావీణ్య కమిటీ చైర్‌పర్సన్, సభ్యులతో పాటు ఛాంబర్, రైతు సంఘాల ప్రతినిధులతో భేటీ అయ్యారు. సమావేశంలో మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ దిడ్డి భాగ్యలక్ష్మి, వైస్ చైర్మన్ కాలేరు గాంధీ, మార్కెట్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

కష్టపడి చదివితే ఉజ్వల భవిష్యత్



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ అయిలయ్య

కేయూ క్యాంపస్: కష్టపడి చదివితే భవిష్యత్తులో ఉన్నత స్థితిలోకి వస్తారని, విద్యార్థి దశలోని అనుభూతి జీవితాంతం గుర్తుంటుందని హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బన్న అయిలయ్య అన్నారు. కళాశాలలో బీఏ విభాగం విద్యార్థులకు శుక్రవారం వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో చదువుకున్న చాలామంది వివిధ రంగాల్లో ఉన్నత స్థానాల్లో ఉన్నారని గుర్తుచేశారు.వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ హనుమంతు మాట్లాడుతూ మూడేళ్లపాటు కళాశాలలో చదువుకుని బయటికి వెళ్లిపోతున్న విద్యార్థులందరికి ఈరోజు ఓ తీపి గుర్తుగా మిగిలిపోతుందని చెప్పారు. కార్యక్రమంలో వివిధ విభాగాల అధ్యాపకులు డాక్టర్ ఆర్.ఆదిరెడ్డి, డాక్టర్ శ్రీధర్‌కుమార్ లోథ్, డాక్టర్ సదాశివ్, డాక్టర్ చిర్ర రాజు, డాక్టర్ తిరుణహరి శేషు, డాక్టర్ చారి, డాక్టర్ రమేష్, డాక్టర్ వీరస్వామి పాల్గొన్నారు.

హనుమకొండ ప్రభుత్వ భవనంలోకి మారుస్తా



మాట్లాడుతున్న చీఫ్‌విప్ వినయ్‌భాస్కర్

హన్మకొండ కల్చరల్: సంగీత, నృత్య కళాశాలను సంగీత విద్యార్థులకు అందుబాటులో ఉండేవిధంగా సంబంధిత మంత్రులతో చర్చించి నెలరోజుల్లో హనుమకొండలో ప్రభుత్వ భవనంలోకి మారుస్తానని ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్ హామీ ఇచ్చారు. రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ, హనుమకొండ జిల్లా విద్యారణ్య ప్రభుత్వ సంగీత, నృత్య కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో కళాశాల 50వ వార్షికోత్సవం శుక్రవారం రాత్రి పోతనపీఠం ఆడిటోరియంలో ఘనంగా జరిగింది. కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.సుధీర్‌కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కార్పొరేటర్ దేవరకొండ విజయలక్ష్మి, కళాకారులు జగన్నాథచారి, సీనియర్ అసిస్టెంట్ గడ్డం శంకర్, ప్రొఫెసర్ తిరుపతయ్య, శర్మ, అజయ్, వెంకన్న, కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, కళాకారులు, తదితరులు పాల్గొన్నారు.

టైలర్ స్ట్రీట్‌లో అగ్నిప్రమాదం



హన్మకొండ చౌరస్తా: హనుమకొండ టైలర్‌స్ట్రీట్‌లోని శ్రీలలితా పరమేశ్వరీ జ్యువెల్లరీ వర్క్‌షాప్‌లో షార్ట్ సర్క్యూట్‌తో శుక్రవారం అగ్నిప్రమాదం జరిగింది. దుకాణ యజమాని అద్దంకి సురేష్ తెలిపిన వివరాలు ప్రకారం రోజు మాదిరిగా గురువారం రాత్రి దుకాణం మూసివేసి ఇంటికి వెళ్లారు. శుక్రవారం ఉదయం 4గంటల సమయంలో వర్క్‌షాప్ నుంచి పొగలు వస్తున్నట్లు పక్కనే ఉంటున్న దుకాణ గుమస్తా గమనించి సమాచారం అందించాడు. ఈమేరకు ఫైర్ అధికారి నాగరాజు నేతృత్వంలో ఫైర్ సిబ్బంది హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకుని మంటలు వ్యాపించకుండా చర్యలు తీసుకున్నారు. ప్రమాదంలో సుమారు రూ.3 లక్షల వరకు ఆస్తినష్టం జరిగినట్లు బాధితుడు తెలిపాడు.

పోగొట్టుకున్న ఫోన్ అప్పగింత

కాజీపేట: ఓ వ్యక్తి పోగొట్టుకున్న ఫోన్ ఆచూకీని సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్ అనే కొత్త సాంకేతికతను పోలీసులు ఉపయోగించి కనుగొన్నారు. ఈమేరకు కాజీపేట పోలీస్‌స్టేషన్‌లో బాధితుడికి ఫోన్‌ను సీఐ సార్ల రాజు శుక్రవారం అందజేశారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం డీజిల్ కాలనీకి చెందిన కాంబ్లే ధావన్ ఈనెల 15న కాజీపేట చౌరస్తాలోని అపోలో ఫార్మసీకి వచ్చి తిరిగి వెళ్తున్న క్రమంలో ఫోన్ పోగొట్టుకున్నాడు.

మద్యం మత్తులో వ్యక్తి హల్‌చల్

వరంగల్ క్రైం: మద్యం మత్తులో ఓ వ్యక్తి ట్రాఫిక్ పోలీసులకు చుక్కలు చూపించాడు. డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో భాగంగా హనుమకొండ ట్రాఫిక్ పోలీసులు డబ్బాల వద్ద శుక్రవారం సాయంత్రం తనిఖీలు చేస్తుండగా మద్యం తాగి ద్విచక్ర వాహనంపై వచ్చిన ఓ వ్యక్తిని ఆపారు. జరిమానా విధించేందుకు వివరాలు అడుగగా మద్యం మత్తులో ఉన్న సదరు వ్యక్తి తన దగ్గర ఉన్న పెట్రోల్‌ను ఒంటిపై పోసుకొని బెదిరింపులకు పాల్పడినట్లు తెలిసింది.

ప్రత్యేక ప్రార్థనలకు సర్వం సిద్ధం



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఈద్గా ప్రతినిధులు

ఖిలా వరంగల్: ఈద్-ఉల్-ఫితర్ ప్రత్యేక ప్రార్థనలకు వరంగల్ ఫోర్ట్‌రోడ్డులోని ఖిలా వరంగల్ ఈద్గాను సుందరంగా ముస్తాబు చేశారు. శనివారం ఉదయం 9.30 గంటలకు ముస్లింలు నిర్వహించే సామూహిక ప్రార్థనల కోసం మసీదు ఈద్గాల వద్ద ఈద్గా అధ్యక్షుడు ఎంఏ.జబ్బార్ ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఉమ్మడి వరంగల్ వ్యాప్తంగా 40వేలకు పైగా ముస్లింలు ఖిలా వరంగల్ ఈద్గాలో ప్రార్థనలు చేయనున్నారని జబ్బార్ తెలిపారు. మిల్స్‌కాలనీ ఇన్‌స్పెక్టర్ ముస్కు శ్రీనివాస్, ఈద్గా అధ్యక్షుడు ఎంఏ.జబ్బార్‌లతో కలిసి ఏసీపీ బోనాల కిషన్ ఈద్గా ప్రాంగణాన్ని శుక్రవారం సాయంత్రం క్షుణ్ణంగా పరిశీలించారు.కార్యక్రమంలో ఎస్సైలు సుమన్, కుమార్, సాంబయ్య, ఈద్గా అభివృద్ధి కమిటీ సభ్యులు ముగ్దుం, దస్తగిరి, యాకూబ్, నసీర్, మాషూక్, అష్రఫ్, అమ్జద్‌ఖాన్, అజీమ్, యాకూబ్, మొహియొద్దీన్ పాల్గొన్నారు.

సామూహిక ప్రార్థనలకు ఈద్గాల ముస్తాబు

న్యూశాయంపేట: రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని నగరంలోని ఈద్గాలను నిర్వాహకులు ముస్తాబు చేశారు. ప్రత్యేక ప్రార్థనలు చేసేందుకు వీలుగా ఆయా కమిటీల ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

కార్పొరేట్‌కు దీటుగా సర్కార్ స్కూళ్లు



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రమేష్

హసన్‌పర్తి: కార్పొరేట్ స్థాయికి దీటుగా సర్కార్ స్కూళ్లను నిర్వహిస్తున్నట్లు వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్ అన్నారు. మన బస్తీ – మన బడి కార్యక్రమాన్ని పురస్కరించుకుని వంగపహాడ్ పాఠశాలలో రూ.33.42 లక్షలు, దేవన్నపేటలో రూ.12.59 లక్షల వ్యయంతో సమకూర్చిన ఫర్నిచర్‌తో పాటు ఇతర నిర్మాణ పనులను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాణ్యమైన విద్య, మెరుగైన సౌకర్యాలు కల్పనకు మన బస్తీ – మన బడి కార్యక్రమానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టినట్లు వివరించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ దివ్యారాణి, మాజీ కార్పొరేటర్ బానోతు కల్పన, డివిజన్ అధ్యక్షుడు జంగా కుమార్, శ్రీధర్, బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు శ్రీనివాస్, మన బడి – మన బాధ్యత నియోజకవర్గ కన్వీనర్ కుమార్, మాజీ పీఏసీఎస్ చైర్మన్ అశోక్, గ్రంథాలయ సంస్థ డైరెక్టర్ సముద్రాల మధు, ఆత్మ డైరెక్టర్ భూపాల్, ఎస్ఎంసీ చైర్మన్ మమత పాల్గొన్నారు.

విద్యార్థులు లక్ష్యంతో ముందుకు సాగాలి



జ్యోతిప్రజ్వలన చేస్తున్న అతిథులు

మడికొండ: విద్యార్థులు ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకొని ముందుకు సాగాలని మడికొండ ఇన్‌స్పెక్టర్ వేణు సూచించారు. మడికొండలోని మండల పరిషత్ పాఠశాల వార్షికోత్సవం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ మాట్లాడారు. కష్టపడి చదివితే జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన పలు ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో 64వ డివిజన్ కార్పొరేటర్ ఆవాల రాధికారెడ్డి, హెచ్‌ఎం మల్లారెడ్డి, ఉపాధ్యాయులు మన్నె చంద్రయ్య, కోమల్‌రెడ్డి, రమేష్, ఇందిర, రాజేశ్వరి, అరుణ, కమల, హైమావతి, రమ, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

న్యూ పెన్షన్ స్కీం రద్దు చేయాలని నిరసన



నిరసన తెలుపుతున్న యూనియన్ నాయకులు

కాజీపేట రూరల్: న్యూ పెన్షన్ స్కీం రద్దు చేయాలని కాజీపేట జంక్షన్ ఎదుట రైల్వే మజ్దూర్ యూనియన్ అన్ని బ్రాంచీల నాయకులు శుక్రవారం నిరసన తెలిపారు. ఆల్ ఇండియా రైల్వే ఫెడరేషన్ (ఏఐఆర్ఎఫ్) జనరల్ సెక్రటరీ డిల్లీ శివగోపాల్ మిశ్రా దేశ వ్యాప్తంగా ఇచ్చిన పిలుపు మేరకు ఆందోళన వ్యక్తం చేశారు. మజ్దూర్ యూనియన్ నాయకులు పి.వేదప్రకాష్, ఆర్.సమ్మయ్య మాట్లాడుతూ రైల్వేలో న్యూ పెన్షన్ స్కీంను రద్దు చేయాలని, పాత పెన్షన్ స్కీంను కొనసాగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైల్వే మజ్దూర్ యూనియన్ నాయకులు డాక్టర్ శ్రీనివాస్ యాదవ్, గిరిమిట్ల రాజేశ్వర్‌రావు, జానీవియా, రవికిరణ్, భిక్షపతి, సదాశివరెడ్డి, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

వడ్డెర బస్తీల్లో మౌలిక సదుపాయాలు కరువు



మహాసభ వేదికపై నుంచి అభివాదం చేస్తున్న అతిథులు

హన్మకొండ: వడ్డెర బస్తీలు, కాలనీలు కనీస మౌలిక సదుపాయాల కల్పనకు నోచుకోలేదని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఏనుగుల రాకేష్‌రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. హనుమకొండలోని కల్యాణి ఫంక్షన్ హాల్‌లో తెలంగాణ రాష్ట్ర వడ్డెర సంఘం హనుమకొండ, వరంగల్ జిల్లాల ద్వితీయ మహాసభ శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుడిసెలు వేసుకుని జీవిస్తున్న వడ్డెరలకు ప్రభుత్వం పట్టాలివ్వకుండా ఇబ్బంది పెడుతోందని వాపోయారు. కార్మికులు, శ్రామికుల కోసం ఈ-శ్రమ్‌తో పాటు అనేక సంక్షేమ పథకాలను కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తోందని వివరించారు. తెలంగాణ రాష్ట్ర వడ్డెర సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు పల్లపు సమ్మయ్య, రాష్ట్ర అధ్యక్షుడు దారంగుల నగేష్ మాట్లాడారు. రాష్ట్ర ముఖ్య సలహాదారుడు సాంబరావు, నాయకులు రవీందర్ దుర్గయ్య, లక్ష్మి, అయిలయ్య, పల్లపు రాజేందర్, వెంకట స్వామి, కృష్ణ, బొంత మురళి, గుంజ స్వామి పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

పేదలకు చేతనైన సాయం చేయాలి

కాజీపేట: సంపాదించిన దాంట్లో ప్రతీఒక్కరు కొంత భాగాన్ని నిరుపేదలకు అందించాలని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే, చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్ అన్నారు. కాజీపేట 63వ డివిజన్ అంబేడ్కర్ నగర్ కాలనీలోని ఆల్ఫా ఓమేగా చర్చి ఆవరణలో ఉచిత కుట్టు శిక్షణ కేంద్రం, ఉచిత తాగునీరు, ఉచిత కంప్యూటర్ శిక్షణ కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా 70 మంది ముస్లిం పేద కుటుంబాలకు బిషప్ జాన్ మార్కండేయ చేతుల మీదుగా నిత్యావసర వస్తువులను పంపిణీ చేశారు.

నాయకులు నిత్యం ప్రజల్లో ఉండాలి

హసన్‌పర్తి: ఎంఎస్పీ, అనుబంధ సంఘాల నాయకులు నిత్యం ప్రజల మధ్యలో ఉండాలని ఆ పార్టీ జిల్లా ఇన్‌చార్జ్ మంద రాజు పిలుపునిచ్చారు. ఈమేరకు పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం హసన్‌పర్తి మండల కేంద్రంలో శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంఎస్పీ, ఎమ్మార్పీఎస్‌లను క్షేత్రస్థాయిలో పటిష్టం చేయాలని సూచించారు. సమావేశంలో రాజారపు భిక్షపతి పాల్గొన్నారు.

రైల్వే ఆర్పీఎఫ్ పోలీస్ స్టేషన్‌లో వైద్య శిబిరం

కాజీపేట రూరల్: కాజీపేట రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ పోలీస్‌స్టేషన్‌లో రైల్వే ఆస్పత్రి వైద్యుల సహకారంతో వైద్య శిబిరాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈమేరకు పలువురికి పలు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు.

ఈ యాప్ ఎంతో ఉపయుక్తం

హన్మకొండ: వివిధ పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న ఆర్థికంగా వెనుకబడిన నిరుద్యోగుల కోసం ఇండస్ ఫౌండేషన్ రూపొందించిన ఈ – రాకేష్‌రెడ్డి యాప్ ఎంతో ఉపయుక్తమని నిట్ డైరెక్టర్ ఎన్వీ.రమణారావు అన్నారు. హనుమకొండ నక్కలగుట్టలోని హరిత కాకతీయ హోటల్‌లో రాకేష్‌రెడ్డి యాప్‌పై శుక్రవారం అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుద్యోగుల కోసం యాప్‌ను రూపొందించడం అభినందనీయన్నారు. బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఏనుగుల రాకేష్‌రెడ్డి మాట్లాడుతూ నిరుద్యోగులు ఈ యాప్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

వృద్ధురాలికి ఆర్థిక సాయం

ఖిలా వరంగల్: ఖిలా వరంగల్ పడమరకోట ప్రాంతానికి చెందిన కొప్పుల మల్లయ్య (75) ఇటీవల అనారోగ్య సమస్యలతో మృతి చెందారు. ఈమేరకు వృద్ధురాలు లచ్చమ్మను బీజేపీ రాష్ట్ర నేత, అర్బన్ కోఆపరేటివ్ బ్యాంకు చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్‌రావు శుక్రవారం పరామర్శించారు. లచ్చమ్మకు రూ.3వేలు నగదుతోపాటు 50కిలోల బియ్యం అందజేశారు.

చలివేంద్రం ప్రారంభం

కాజీపేట: ఎండల తీవ్రతను దృష్టిలో పెట్టుకుని అనేక ప్రాంతాల్లో తాగునీటి చలివేంద్రాలను ప్రారంభిస్తున్నట్లు 60వ డివిజన్ కార్పొరేటర్ దాస్యం అభినవ్ భాస్కర్ తెలిపారు.

ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

ఖిలా వరంగల్: ప్రజల అభ్యర్థన మేరకు 39వ డివిజన్ విద్యానగర్‌కాలనీలో విద్యుత్ శాఖ డీఈ మల్లికార్జున్, ఏడీఈ సర్వేశ్వర్ ఏఈ సంపత్ ఆధ్వర్యంలో స్థానిక కార్పొరేటర్ సిద్దం రాజు నేతృత్వంలో నూతన ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు.

పరామర్శ

ఎంజీఎం: అనారోగ్య సమస్యలతో బాధపడుతూ ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న తెలంగాణ ఉద్యమకారుడు, తెలంగాణ రజక హక్కుల సాధన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చాగంటి రమేష్‌ను తెలంగాణ రజక హక్కుల సాధన సమితి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దొడ్డిపల్లి రఘుపతి, జిల్లా అధ్యక్షుడు తంగళ్లపల్లి రమేష్, అల్వాల రాజన్న శుక్రవారం పరామర్శించారు.

జువైనల్ హోమ్‌కు బాలల తరలింపు

కాజీపేట: కాజీపేట పట్టణంలో శుక్రవారం వాహనాల తనిఖీలు చేపట్టి ట్రాఫిక్ నిబంధనలు పాటించని ఏడుగురు బాలలను అదుపులోకి తీసుకున్నట్లు ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కె.రామకృష్ణ తెలిపారు. బాలలను న్యాయమూర్తి ఎదుట హాజరుపర్చి అనంతరం, జువైనల్ హోమ్‌కు తరలించినట్లు తెలిపారు.

బైక్ చోరీ

ఖిలా వరంగల్: వరంగల్ చింతల్ మైసమ్మ గుడి ప్రాంతానికి చెందిన ఎండీ.హైమద్‌కు చెందిన బైక్ చోరీకి గురైంది. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మిల్స్ కాలనీ ఇన్‌స్పెక్టర్ ముస్కు శ్రీనివాస్ తెలిపారు.

కులం పేరుతో దూషించిన వ్యక్తులపై కేసు

కులంపేరుతో దూషించిన వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ తెలిపారు. ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

యువతి అదృశ్యం

కరీమాబాద్‌కు చెందిన దాసరి కావ్య (19) కనబడడం లేదని ఆమె తండ్రి నాగరాజు మిల్స్‌కాలనీ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ తెలిపారు.

అనుమానాస్పదంగా వ్యక్తి మృతి

వరంగల్: పైడిపల్లి శివారు ఆర్ఎస్‌నగర్‌లో భట్టు వెంకన్న (35) అనుమానాస్పదంగా మృతి చెందినట్లు అతని భార్య స్వప్న తెలిపారు. ఆమె ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏనుమాముల ఎస్సై రాజన్‌బాబు తెలిపారు.

సామాజిక విలువలు పెంపొందించాలి



సమావేశంలో మాట్లాడుతున్న దామోదర్

హసన్‌పర్తి: పిల్లల్లో చదువుతో పాటు సామాజిక విలువలను పెంపొందించే విధంగా కృషి చేయాలని చైల్డ్ వెల్ఫేర్ కమిటీ జిల్లా సభ్యుడు దామోదర్ అన్నారు. సీనియర్ సిటీజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, ఓరుగల్లు రక్షణ సమితి సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో హసన్‌పర్తి మండలం మడిపల్లిలో బాలల రక్షణ కమిటీ సమావేశం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నారుల పట్ల ఎలాంటి వివక్ష చూపరాదన్నారు. సీనియర్ సిటీజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యదర్శి తేరాల యుగంధర్ మాట్లాడుతూ పెద్దల పట్ల గౌరవం, సమాజం పట్ల బాధ్యతతో పిల్లలు మెలిగే విధంగా చూడాలని వివరించారు. స్థానిక సర్పంచ్ చిర్ర సుమలత అధ్యక్షతన జరిగిన సమావేశంలో ప్రధానోపాధ్యాయుడు రాజిరెడ్డి, ఉపసర్పంచ్ రంజిత్, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

గ్రీన్‌వుడ్‌లో అలరించిన టాలెంట్ షో



ఎగ్జిబిట్లను పరిశీలిస్తున్న పాఠశాల డైరెక్టర్లు

కాజీపేట అర్బన్: హనుమకొండ హంటర్‌రోడ్డులోని గ్రీన్‌వుడ్ పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన మ్యాథ్స్ ఫెయిర్, ఫుడ్ ఫెస్ట్, ఆర్ట్ గ్యాలరీ టాలెంట్ షోలు అలరించాయి. టాలెంట్ షో కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా పాఠశాల డైరెక్టర్లు చల్లా ధర్మారెడ్డి, జి.భరద్వాజ నాయుడు హాజరై ఎగ్జిబిట్లను తిలకించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థుల్లో సృజనాత్మకత శక్తిని పెంపొందించేందుకు ఇలాంటి టాలెంట్ షోలు దోహదపడుతాయని అన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మంజులాదేవి, సీఏఓ ప్రభుకుమార్, వైస్ ప్రిన్సిపాల్ మహేందర్, ఏసీఓలు శ్రీకాంత్, హర్షవర్ధన్, రుమానా, ఏఓ మురళి, హెచ్ఆర్ వాసు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాజ్యాంగ రక్షణకు పోరాటాలు



మాట్లాడుతున్న అనిల్‌కుమార్

న్యూశాయంపేట: మనువాదానికి వ్యతిరేకంగా రాజ్యాంగ రక్షణ కోసం పోరాటాలు ఉధృతం చేయాలని డీహెచ్‌పీఎస్ రాష్ట్ర కార్యదర్శి మరుపాక అనిల్‌కుమార్ పిలుపునిచ్చారు. దళిత పోరాట సమితి హనుమకొండ జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశం బాలసముద్రంలోని సీపీఐ కార్యాలయంలో దేవా అధ్యక్షతన శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్ఎస్ఎస్ కనుసన్నల్లో పరిపాలన చేస్తున్న బీజేపీ ప్రభుత్వం.. మనువాద కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేస్తూ పేదలపై పెనుభారాలు మోపుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. సమావేశంలో కర్రె భిక్షపతి, ఎల్లేశ్, మనోహర్, శంకర్‌నాయక్, రామ్మూర్తి పాల్గొన్నారు.